ఆరంజ్ అలర్ట్

వరద ప్రభావ ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ,ఎస్వో



గంగాధరనెల్లూరు మండలంలోని శెట్టిఫారం వెళ్ళేదారిలో మొరవనీటి ప్రవాహానికి కోతకు గురైన మట్టిరోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడీ, ఎస్వో గిరీషా



నీవా నది ఉధృత ప్రవాహానికి చిత్తూరు సమీపంలోని బీఎన్ఆర్ పేట వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఆరంజ్ అలెర్ట్ జిల్లాగా వాతావరణ శాఖ ప్రకటించింది. 29, 30 తేదీల్లో కూడా జిల్లాపై మొంథా తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి గిరీషా సోమవారం చిత్తూరుకు చేరుకున్నారు.గంగాధర నెల్లూరు మండలం తూంగుండ్రం, ఆత్మకూరు చెరువు వరద ప్రభావ ప్రాంతాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడీతో కలిసి గిరీషా పరిశీలించారు.ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను వారిద్దరూ గిరీషాకు వివరించారు. ఎక్కడికక్కడ ప్రజలను ఎస్ఎంఎస్ , వాట్సాప్ మెజేజీల ద్వారా ముందస్తుగా అప్రమత్తం చేస్తూ నష్ట నివారణ చర్యలు చేపట్టామని చెప్పారు. కాగా సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యల గురించి గిరీషా సమీక్షించారు.వచ్చే రెండు రోజులు కుప్పం, నగరి, చిత్తూరు నీవానది చుట్టుపక్కల కాలనీల్లో ఆయన పర్యటించే అవకాశం ఉంది.

11మండలాల్లో తేలికపాటి వర్షం

గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 11 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. చౌడేపల్లె, బంగారుపాళ్యం మండలాల్లో 9.4 మి.మీ, పుంగనూరు, నగరి మండలాల్లో 4.4, వి.కోటలో 3.2, పెనుమూరులో 3, పెద్దపంజాణిలో 2.4, ఎస్ఆర్‌పురంలో 2.2, గంగవరంలో 1.8, పలమనేరులో 1.2, తవణంపల్లెలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

తుఫాను ప్రభావిత గ్రామాల్లో

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయండి

- ప్రత్యేక అధికారి పీఎస్ గిరీషా



ఐరాల మండలం ఉప్పరపల్లె వద్ద నీవానదిపై కష్టమ్మీద గడ్డి మోపు తీసుకొస్తున్న మహిళలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, తుఫాన్ షెల్టర్లతో పాటు అవసరమైతే కళాశాలలు, పాఠశాలలు వంటి ప్రభుత్వ భవనాలను పునరావాస కేంద్రాలుగా వినియోగించుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి పీఎస్ గిరీషా సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లో తుఫాను ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో సమీక్షించారు.భారీ వర్షాలకు కూలేస్థితిలో వున్న పూరిళ్లలో ఉంటున్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.పునరావాస కేంద్రాల్లో ఉండే ప్రజలకు మూడురోజులకు సరిపడే నిత్యావసర సరుకులను సిద్ధం చేసుకోవాలన్నారు. అక్కడే ఆహారాన్ని వండి వారికి భోజనాలు అందించాలని, చిన్న పిల్లలు ఉంటే పాలు సరఫరా చేయాలని సూచించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలల సిబ్బంది విధులతో పాటు పునరావాస కేంద్రాల విధుల్లో పాల్గొనాలని ఆదేశించారు.హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా సమీప ఆస్పత్రుల్లో చేర్పించడంతో పాటు వారి సహాయకులకు వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. మంచినీరు కలుషితం కాకుండా పైపులైన్లను తనిఖీ చేయాలని, క్లోరినేషన్ చేసిన మంచినీటినే ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాల వద్ద జనరేటర్‌ను సిద్ధంచేయాలన్నారు.

పూర్తిగా నిండిన 1305 చెరువులు

జిల్లావ్యాప్తంగా 4122 చెరువులుండగా, వాటిలో వందశాతం మేర 1305 చెరువులు నిండగా, 75శాతం 723 చెరువులు, 50శాతం మేర 1093 చెరువులు నిండగా, మిగిలిన చెరువుల్లో 25శాతం నీరు చేరాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు.చెరువులను నిరంతరం పర్యవేక్షించాలని, ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల నీటి ప్రవాహాన్ని అంచనా వేసుకుని ఇరిగేషన్ అధికారులు అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని సూచించారు. గండి పడే అవకాశం ఉన్న, ప్రమాదకరంగా మారే ప్రదేశాల్లో ఇసుక వంటి మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు.

మండలకేంద్రాల్లోనే అధికారులు, సిబ్బంది ఉండాలి

తుఫాన్ ప్రభావంతో పంటలకు, ఆస్తులకు నష్టం జరిగితే ఆ వివరాలను ప్రభుత్వానికి అందించేందుకు మండల ప్రత్యేక అధికారులు, సిబ్బంది మండలకేంద్రాల్లోనే ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.ఇరిగేషన్ ఎస్ఈ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడూ పాఠశాలలకు సెలవు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్ష సూచనతో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు తెరిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా ఎంఈవోలు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు.



గుడిపాల మండలం పేయన్నపల్లెలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కో-ఆర్డినేటర్ రామకృష్ణారావు తదితరులు

నేడు, రేపు కూడా భారీ వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను పట్ల భయాందోళన వద్దని ప్రజలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో సూచించారు.తుఫానుకు సంబంధించి సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దని కోరారు. మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. అధికారులు సూచించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని, పిడుగులు పడే సమయంలో కూలే స్థితిలో వున్న భవనాలు, చెట్లు, వీధి స్తంభాల కింద ఉండవద్దని పేర్కొన్నారు. భద్రత, మనుగడ కోసం అవసరమైన వస్తువులతో సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని, మీ ఇల్లు సురక్షితం కాకపోతే తుఫానుకు ముందే పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పెంపుడు జంతువులను, పశువులను తాడు విప్పి వదిలేయాలన్నారు. అత్యవసర సమాచారం కోసం కలెక్టరేట్‌తో పాటు నాలుగు ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలూ పనిచేసేవిధంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ప్రజలు ఏదైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఫోన్‌చేసి వివరాలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో 24గంటలూ పనిచేసే టోల్‌ఫ్రీ నెంబరు 112, 1070, 1800 425 0101కి కాల్‌చేసి వివరాలు తెలియజేయవచ్చని ఆయన తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో

మొంథా హెల్ప్‌లైన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తామని పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ ప్రజలకు భరోసా ఇచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖలను అప్రమత్తం చేసిందన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తుఫాన్ కారణంగా ఎవరైనా ఇబ్బందులకు గురైతే 9618075563 నెంబరుకు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. అలాగే పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల శంకుస్థాపన వాయిదా

కుప్పం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబుచే మంగళవారం జరగాల్సిన ఏడు పరిశ్రమల వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) అధికార వర్గాలు తెలిపాయి. నియోజకవర్గంలో అలీప్ ప్లాటెడ్- ఫ్యాక్టరీ ఉమెన్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ పార్క్, మదర్ డైరీ- ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్- ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంట్స్, ఈ-రాయిస్ మోటార్స్- ఎలక్ట్రిక్ వెహికల్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్- డెయిరీ రిలేటెడ్ ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ అండ్ అనిమిల్ ఫీడ్, హిండాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్- ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రక్షన్ ఫ్యాక్టరీ, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్- దిన ఎడిబుల్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్లను వర్చువల్‌గా ప్రారంభించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు.రూ.2,203 కోట్ల వ్యయంతో ప్రారంభించనున్న ఈ పరిశ్రమల వల్ల ప్రత్యక్షంగా 7,093 మందికి, పరోక్షంగా 15,237 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుందని అంచనా. మొంథా తుపాను నేపథ్యంలో వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ త్వరలోనే ప్రకటిస్తామని కడా అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ముగిసిన ఆయుధాల ప్రదర్శన



ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఏఆర్ సిబ్బంది

చిత్తూరు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతిఏటా అమరవీరులైన పోలీసులను స్మరించుకుంటూ ఏఆర్ పెరేడ్ మైదానంలో నిర్వహించే ఆయుధాల ప్రదర్శన ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ప్రదర్శనలో ఉంచారు. వందల సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆయుధాల గురించి ఏఆర్ పోలీసులు వివరించారు. ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధాలను వినియోగిస్తారు, వాటి పనితీరు గురించి వివరించారు.

సమయపాలన పాటించాల్సిందే

- పాఠశాలల్లో టీచర్ల బోగస్ హాజరు, పనితీరుపై ప్రభుత్వ దృష్టి



చిత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించింది. కొత్త ఉపాధ్యాయుల నియామకం, టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయిన క్రమంలో సిలబస్ బోధన, పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై కచ్చితంగా వ్యవహరించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు యాప్‌లో హాజరు నమోదు చేయడంతో పాటు 9.30 గంటలకు హాజరు నివేదికను అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. డీఈవోతోపాటు డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు ఈ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. జిల్లాలోని 2,397 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 2,51,317 మంది విద్యార్థులు చదువుతున్నారు. 8,314 మంది టీచర్లు పనిచేస్తున్నారు.

హాజరు నిబంధనలు ఇలా..

- ఉదయం 9 గంటలకు హాజరై సాయంత్రం 4 వరకు కచ్చితంగా పాఠశాలల్లోనే ఉండాలి.
- ఎవరైనా లీవ్ పెడితే ఉదయం 9 గంటల లోపే దరఖాస్తు చేసుకోవాలి.
- స్పెషల్ డ్యూటీపై వెళితే హాజరు నమోదు చేసుకోవాలి.
- ఉదయం 9.15 గంటలకు అటెండెన్స్ రిపోర్టు తీసి పంపాలి.
- రిపోర్టులో లీవు దరఖాస్తు చేయకున్నా, ఇన్ టైమ్ మార్క్ వేయకున్నా, స్పెషల్ డ్యూటీ అని పెట్టి హాజరు నమోదు చేయకపోయినా వారికి షోకాజ్ నోటీసులు ఇస్తారు.
- ఈ ప్రక్రియలో పలుమార్లు ఇదే విధానం కొనసాగితే సంబంధిత టీచర్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారు.
- మధ్యాహ్నం లీవ్ పెట్టేవారు 12.30 గంటల తర్వాత మాత్రమే అవుట్ టైం నమోదు చేయాలి.
- ఉదయం లీవ్ పెట్టిన వారు మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత 12.45 లోపు హాజరు నమోదు చేయాల్సి ఉంది.

ప్రత్యేక సెల్ ఏర్పాటు

జిల్లాలోని పాఠశాలలు, టీచర్ల పనితీరు, హాజరు, సమయపాలన అంశాలపై మానిటరింగ్ చేసేలా కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఇందులో డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, సెక్టోరియల్ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఉదయం, సాయంత్ర వేళల్లో ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల ముగిసిన తర్వాత సమయాన్ని నమోదు చేస్తారు. పాఠశాలల పనితీరుపై విద్యాశాఖ కమిషనర్ రోజూ ఉదయం 10 గంటలకు ఆర్జేడీ, డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలతో వెబెక్స్ నిర్వహిస్తారు.

మధ్యాహ్న భోజనం హాజరుపైనా దృష్టి

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు రోజువారి మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సి ఉంది. ఇందుకోసం విద్యార్థుల రోజువారీ హాజరు తప్పనిసరి. పలువురు విద్యార్థులు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయడం లేదని తెలుస్తోంది. కానీ వారిని కూడా లెక్కల్లో చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో వారికి చెందాల్సిన భోజనం, గుడ్లు, చిక్కీలు తదితరాలు ఎవరి ఖాతాల్లో జమవుతున్నాయనే దానిపైనా దృష్టి సారించనున్నారు.

కఠారి దంపతుల హత్య కేసు

తీర్పు వాయిదా



ముద్దాయిలు చింటూ తదితరులను కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

చిత్తూరు లీగల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రథమ మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్య కేసు తీర్పును ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు. కఠారి అనురాధ, కఠారి మోహన్ 2015 నవంబరు 17న నగరపాలక కార్యాలయంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు శ్రీరామచంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు 23 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.విచారణ పూర్తయిన తరువాత ఈ నెల 24వ తేదీన చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్‌లను నిందితులుగా తేల్చారు. సోమవారం తుదితీర్పు ఉంటుందని న్యాయమూర్తి ప్రకటించిన నేపథ్యంలో ఆ ఐదుగురిని సోమవారం పోలీసులు 9వ అదనపు జిల్లా కోర్టులో హాజరుపరిచారు.చింటూ తరపున న్యాయవాది విజయచంద్రారెడ్డి పది నిమిషాల పాటు తమ వాదనను వినిపించారు. అనంతరం చింటూ, వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేశ్ వద్ద వాంగ్మూలాన్ని తీసుకున్నారు.చింటూ జరిగిన సంఘటనకు పశ్చాత్తాపపడుతున్నానని న్యాయమూర్తి శ్రీనివాస రావు వద్ద వాపోయాడు. తన తల్లి అనారోగ్యంతో ఉందని, కోర్టు ఈ కేసు నుంచి తప్పిస్తే వ్యాపారంతో పాటు సంఘ సేవ చేసుకుంటానని విన్నవించారు.మిగిలిన నిందితులు కూడా తమ ఆవేదనను కోర్టులో వెల్లడించారు.మధ్యాహ్నం 1.20 గంటలకు న్యాయమూర్తి ఆ ఐదుగురు ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు.ప్రభుత్వాస్పత్రి వైద్యులు, పోలీసులు వారి వాంగ్మూలాలపై నిజానిజాలు పరిశీలించి నివేదికను 30వ తేదీ మధ్యాహ్నం అందజేయాలని న్యాయమూర్తి శ్రీనివాసరావు ఆదేశించారు. అదే రోజు తీర్పును వెల్లడిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు కోర్టు వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

కుప్పం ఇన్నర్ రింగ్ రోడ్డుకు

రూ.30 కోట్లు మంజూరు

కుప్పం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌పోర్ట్, రోడ్లు. భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మొవ్వ తిరుమల కృష్ణబాబు సోమవారం ఇందుకు సంబంధించిన పరిపాలనా అనుమతులతో ఉత్తర్వులు విడుదల చేశారు.

ఎవరైనా లంచం అడిగితే 1064కు సమాచారం ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనులకోసం ఎవరైనా లంచం అడిగితే వెంటనే 1064కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని అవినీతి నిరోదక శాఖ ఏఎస్పీ విమల కుమారి విజ్ఞప్తిచేశారు. విజిలెన్స్ వారోత్స వాల్లో భాగంగా సోమవారం తిరుపతిలోని ఏసీబీ ఆధ్వర్యంలో అవ గాహనా కార్యాక్రమం నిర్వహించారు. ఏసీబీ సిబ్బందిచే అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞచేయించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థు లకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు.. ర్యాలీలు, సైకిల్ మారథాన్లు నిర్వహిస్తామన్నారు.



కొడాలి నాని, పేర్ని నాని

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.., వైసీపీ మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, సినీనటులు రాకేష్, సుజాత ఉన్నారు. అంతకుముందు కర్ణా టక శ్రీకూడలి ఆర్య అక్షభ్య మఠాధిపతి రఘువిజ యతీర్థ స్వామిజీ కూడా ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.



రాకేష్, సుజాత దపంతులు


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెం ట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,021

తలనీలాలు సమర్పించినవారు: 25,894



ఆర్టీసీ అప్రమత్తం

- ఏసీ బస్సుల కండిషన్‌పై ముమ్మర తనిఖీలు
- వేగ నియంత్రణకూ చర్యలు



అమరావతి ఏసీ బస్సు ఇంజన్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది



బస్సులో అత్యవసర ద్వారం పరిశీలన

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): 'కర్నూలు' ప్రమాదం నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. బస్సుల కండి షన్‌పై మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తు న్నారు. జిల్లా వ్యాప్తంగా 11 డిపోలుండగా మంగళం డిపో ద్వారానే 23ఏసీ బస్సులు నడు స్తున్నాయి. ఈ బస్సులన్నీ కాలపరిమితి ముగి శాయి. నూతన బస్సులు రాకపోవడంతో ఉన్న బస్సులకే ఎప్పటి కప్పుడు విడిభాగాలను మారుస్తూ, రంగులు వేస్తూ నెట్టుకొస్తున్నారు. మొన్నటి వరకు దీన్ని పెద్దగా పట్టించుకోకపో యినా.. ఇప్పుడు అధికారుల్లో ఆందోళన నెల కొంది. దీంతో అన్ని బస్సుల కండిషన్, అదనపు సౌకర్యాలు కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో మంగళం డిపోలో అమరా వతి, వెన్నెల, ఇంద్రా బస్సుల్లోని విడి భాగాలను తనిఖీ చేస్తున్నారు. బస్సు ముందు, వెనుక రెండు అగ్నినివారణ యంత్రాల ఏర్పాటు, ప్రతి కిటికీ వద్ద సేఫ్టీ హ్యామర్స్, అత్యవసర ద్వారాలు, ఎలక్ట్రిక్ విధానం మెరుగుపరచడం, ఆయిల్ లీకేజీ కాకుండా చర్యలు చేపట్టారు. బ్రేక్స్, స్టీరిం గ్‌ను మరింత సరిచేయడం, డ్రైవర్ల భద్రతకు హెడ్, ఫాగ్, సిగ్నల్స్ లైట్స్, వైపర్స్‌ను నూత నంగా ఏర్పాటు చేయనున్నారు. ఇంజన్ చెక్ చేస్తున్నారు. లాంగ్ సర్వీసుల్లో ఇద్దరు డ్రైవర్లను విధిగా పంపడం, బస్సులో డ్రైవర్ విశ్రాంతికి ప్రత్యేక సీటు ఏర్పాటు, ఓల్వో ట్రైనింగ్ అయిన డ్రైవర్లనే అనుమతించడం, డ్యూటీ ఎక్కేసమ యంలో ప్రతి డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం, డ్రైవర్లచే ప్రయాణికులకు రక్షణ ఏర్పాట్లు వంటి వాటిపై అవగాహన కల్పించే చర్యలు తీసుకు న్నారు. అమరావతి బస్సు స్పీడు 90కిలోమీటర్లు, ఇంద్రా, వెన్నెల 80కిలోమీటర్ల వేగాన్ని అధిగ మించకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. ప్రయాణంలో సమయపాలన కచ్చితంగా పాటిం చేలా డ్రైవర్లకు డిపో మేనేజర్ సుధాకర్ కౌన్సె లింగ్ ఇచ్చారు. అలాగే, తిరుమల, రేణిగుంట, మదనపల్లె, కడప, నెల్లూరుకు నడుస్తున్న ఎల క్ట్రిక్ ఏసీ బస్సులలో కూడా చెకింగ్ జరుగుతు న్నాయి. అద్దె బస్సుల యాజమాన్యం కాస్త నిర్ల క్ష్యంగా ఉంటున్నట్లు ఆరోపణలున్నాయి.

370 సప్తగిరి బస్సులతో హైటెన్షన్

2018వ సంవత్సరం ముందు వచ్చిన దాదాపు 370సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులు ఘాట్‌లో తిరుగు తూ.. వీటి కాల పరిమితి ఆరు లక్షల కిలోమీటర్ల ను అధిగమించాయి. ప్రస్తుతం 9-10లక్షల మధ్య నడుస్తుండటంతో అధికారుల్లో ఆందోళన నెల కొంది. ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో కొన్ని విడిభాగాలు మార్చి..సాంకేతికతను మెరుగు పరి చినా.. మళ్లీ వీటి కండిషన్‌ను తనిఖీ చేస్తున్నారు.

ఇతర బస్సులపైనా ప్రత్యేక దృష్టి : జిల్లా లోని మిగతాపాతబస్సుల కండిషన్, బ్రేక్‌సిస్టమ్, స్టీరింగ్, ఇంజన్, ఇతర భాగాల పనితీరు, లైటిం గ్, ఎలక్ట్రిక్ సిస్టమ్స్‌ను తనిఖీచేసి మరింత మెరు గుపరిచే చర్యలు చేపట్టారు. పూర్తిస్థాయిలో ఫిట్ గా ఉంటేనే రోడ్డెక్కించాలని డీపీటీవో జగదీష్ ఆ యా డిపోమేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. అద్దెబస్సుల యజమానులతోనూ స మావేశమై వాటి కండిషన్ తనిఖీ చేయించాలని కోరారు.

తిరుపతి జిల్లాకు భారీ వర్ష సూచన

అప్రమత్తమైన యంత్రాంగం ● విద్యాసంస్థలకు సెలవు ● బీచ్‌లు, జలపాతాలకు రాకపోకల నిషేధం



కోట మండలం శ్రీనివాససత్రం వద్ద ముందుకు వచ్చిన సముద్రం

తిరుపతి, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): 'మొంథా' తుఫాను హెచ్చ రికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటిం చింది. మంగళవారం జిల్లాకు భారీ వర్ష సూచన చేసింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థా యిలో అప్రమత్తమైంది. సెలవులు పెట్టిన ఉద్యోగులు, అధికారులు జిల్లాలో అందుబాటులో ఉంటే.. సెలవులను రద్దు చేసుకుని విధుల్లో చేరాలని కలెక్టర్ వెంకటే శ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచీ ఆయన రెవెన్యూ, పోలీసు, ఫైర్, వైద్యారోగ్య, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచా యతీరాజ్, విద్యుత్, వ్యవసాయ వంటి కీలక శాఖల అధికారులను అప్ర మత్తం చేశారు. సంబంధిత శాఖల క్షేత్రస్థాయి ఉద్యోగులు 24 గంటలూ కార్యక్షేత్రంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్ పనులు ఆపేసి.. అక్కడ వినియోగించే ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు సిబ్బందితో పాటు జిల్లా యంత్రాంగానికి అందుబాటులో ఉంచాలన్నారు. ఇక, కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతంలో బీచ్‌ల వద్దకు పర్యాట కుల రాకపోకలను బుధవారం వరకూ నిషేధించారు. ఈ మూడుచోట్ల సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుండడంతో ముందుజాగ్రత్తగా పర్యాటకులను అనుమతించడం లేదు. జిల్లాలోని అన్ని జలపాతాల వద్దకూ బుధవారం వరకు రావొద్దంటూ పర్యాటకులకు అధికారులు సూచించారు. ఇప్పటికే సోమవారం నుంచీ బుధవారం వరకూ మూడు రోజుల పాటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన సంగతి తెలిసిందే. తుఫాను హెచ్చరి కల తీవ్రత దృష్ట్యా కలెక్టరేట్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు ఆర్డీవో కార్యాలయాలతో పాటు అన్ని మున్సిపల్.. తహసిల్దారు కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఇవి 24 గంటలూ పనిచేయనున్నాయి. సమస్యలపై ప్రజలు కంట్రోల్ రూమ్‌లకు సమాచారం ఇస్తే.. పరిస్థితికి అనుగుణంగా వారు స్పందిస్తారు.అదనంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి నేరుగా ఫిర్యాదులు, సాయం కోసం అభ్యర్థనలు చేయడానికి, అత్యవ సర సమాచారం ఇవ్వడానికి టోల్ ఫ్రీ నెంబర్ కూడా ప్రకటించారు.

తీర ప్రాంతంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

జిల్లాకు రెండు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వచ్చాయి. కోట, వాకాడు, చిల్లకూరు వంటి సముద్ర తీర ప్రాంత మండలాలలో సహాయక చర్యల కోసం ఒక బృందాన్ని గూడూ రులోను.. మరో బృందాన్ని సూళ్ళూ రుపేటలో వుంచారు. పులికాట్ సరస్సు పరంగా ఇబ్బందులు తలె త్తితే తడ, సూళ్ళూరుపేట మండలా లకు, స్వర్ణముఖి, కాళంగి నదుల పరంగా ఇబ్బందులు ఎదురైతే నాయుడుపేట, శ్రీకాళహస్తి తదితర మండలాలకు త్వరగా చేరుకునేలా అక్కడ ఉంచారు.

కోట మండలంలో కడలి కల్లోలం

కోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల సమీపంలోని సముద్రం సోమవారం కల్లోలభరితంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతు న్నాయి. 30నుంచి 40 మీటర్లలోతు సముద్రం అలల ఉధ్రిక్తతో ముందుకు వచ్చిందని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. వాకాడు మండలం తూపి లిపాళెంలో రాకాశి అలలు 5 మీటర్ల మేర ఎగిసిపడుతున్నాయి. కోట తహ సీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎస్‌ఐ పవన్‌కు మార్ ఆయా గ్రామాలకు వెళ్లి మత్స్యకారులకు ధైర్యం చెప్పారు. ఇక, స్వర్ణ ముఖి పొర్లుకట్టలు బలహీనంగా ఉన్న పుచ్చలపల్లి, అల్లంపాడు, దైవాల దిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లో రెడ్‌అలెర్ట్ ప్రకటించారు. అక్కడి ప్రజలను సుర క్షిత ప్రాంతాలకు తరలించేందుకు మైక్‌ల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి గూడలిలోని స్వర్ణముఖి నది ప్రవాహ తీరును.. దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లో పొర్లుకట్టలను పరిశీ లించారు. ఇక, తీరంలో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పర్యాటకులను సముద్రంవద్దకు రాకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. మరోవైపు ఆక్వా గుంతలలో తక్కువ కౌంట్‌తోనే రొయ్యలను పట్టి రైతులు సొమ్ము చేసుకుంటున్నారు.

తిరుమలలో ముసురు



ఆలయం ముందు కురుస్తున్న జల్లులు

తిరుమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం తిరుమలలో వేకువజాము నుంచే ముసురు వాతావరణం కని పించింది. చిరుజల్లులే కావడంతో భక్తులకు పెద్దగా అసౌకర్యం కలుగలేదు. ఉండిఉండీ దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేస్తోంది. సాయంత్రానికి చలి తీవ్రత పెరిగింది. తుఫాన్ ప్రకటనల నేపథ్యంలో రద్దీ కూడా తక్కువ గానే ఉంది. ఆలయ పరిసరాల్లో భక్తులు పలుచగా కనిపించారు. పదిరోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమల ఘాట్‌రోడ్లపై ఫారెస్ట్, ఇంజి నీరింగ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తరుచూ కొండచరియలు విరిగి పడే ప్రాంతాలపై దృష్టి పెట్టారు. అనుకోకుండా కొండరాళ్లు, చెట్లు విరిగిపడితే వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘాట్‌రోడ్లలో నెమ్మ దిగా ప్రయాణించాలని, చెట్ల కింద ఉండకూడదంటూ ప్రకటనలు చేశారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 19 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం/నారాయణవనం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు అట వీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరు స్మగ్లర్లను అరెస్టుచేసి 19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఏఆర్‌ఎస్‌ఐ ఈశ్వరరెడ్డి బృందం ఆదివారం కైలాసకోన నుంచి కూంబింగ్ చేపట్టారు. సోమ వారం నారాయణవనం సమీపంలోని సింగారకోన రోడ్డు కన్నికలమ్మ ఆలయం సమీపానికి చేరుకోగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద రీతిలో టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడ్డారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను చూసి పారి పోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని విచారించగా పరిసర ప్రాంతాల్లో ఎర్రచందనం దుంగలు దాచి ఉంచినట్లు చెప్పారు. వారు దాచిన 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని పట్టుబడిన వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని స్థానికులుగా గుర్తించారు. దుంగలతో పాటు స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా కార్మికుడి హత్య

చిల్లకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి హత్యకు దారితీసింది. పోలీసుల తెలి పిన వివరాల మేరకు... ఒడిశా రాష్ట్రానికి చెందిన నరసింగ్ ఓరమ్(28), సమీర్ నాయక్ మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగర మాల రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్నారు. ఆదివారం రాత్రి మద్యం తాగు తుండగా ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో సమీర్‌నాయక్ ఇనుపరాడ్డుతో నరసింగ్ ఓరమ్‌ను కొట్టాడు. అతనికి తీవ్రంగా గాయాలు కావడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం నరసింగ్ ఓరమ్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సియోల్‌లో శ్రీసిటీ బృందం పర్యటన



కొరియా ప్రతినిధులతో శ్రీసిటీ బృందం

సత్యవేడు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడులు, వ్యాపార విస్తరణలో భాగంగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం కొరియాలో పర్య టిస్తోంది. శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ నేతృత్వంలో సియో ల్‌లోని భారత రాయబార కార్యాలయ డిప్యూ టీ కమిషనర్ చీఫ్ నిషికాంత్ సింగ్, జపాన్ ఉన్నతాధికారులు కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పారి శ్రామిక ప్రగతి, 31 దేశాలకు చెందిన 240కు పైగా పరిశ్రమలను ఆకర్షించడంలో శ్రీసిటీ పాత్రను వివరించారు. ఎల్జీ, సోలుమ్, హ్యుం దాయ్, ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ (హెచ్‌డీసీ), ఎస్కే ప్యుకేర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రముఖ కొరియన్ కంపెనీలు ఇప్పటికే శ్రీసిటీలో కార్యక లాపాలు నిర్వహిస్తున్నట్లు వారికి వివరిం చారు. అలాగే సియోల్‌లో జరిగిన కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఐటీ ప్రదర్శన (కేఈఎస్ 2025)ను సందర్శించారు. కొట్రా (కొరియా ట్రేడ్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ ఏజెన్సీ) అధికారులు, ఇతర వ్యాపార ప్రతిని ధులతో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించి, పెట్టుబడి భాగస్వామ్య అవకాశాలను చర్చిం చారు. శ్రీసిటీ వేగవంతమైన పురోగతిని వివ రించిన నిషికాంత్ సింగ్ భవిష్యత్ కొరియా పెట్టుబడులకు తన మద్దతు తెలిపారు. శ్రీసిటీ బృందం సియోల్ పర్యటన శ్రీసిటీ, కొరియన్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలపరుస్తుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు.





నారద పుష్కరిణిలో ఏర్పాటు చేసిన దీపాలు, దీపాలు వెలిగిస్తున్న ఈవో దంపతులు

శ్రీకాళహస్తిలో లక్ష దీపోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నారద పుష్కరిణిలో కార్తీక మాసం మొదటి సోమవా రాన్ని పురస్కరించుకుని లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. పుష్కరిణి చుట్టూ క్రమపద్ధ తితో నేతిదీపాలను ఆలయాధికారులు సిద్ధం చేశారు. పుష్కరిణి ప్రాంగణంలో స్వామి అమ్మవార్ల చిత్రపటానికి పూజలు చేసి హారతులు సమర్పించారు. అనంతరం ఈవో బాపిరెడ్డి దంపతులు నేతి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు. కార్తీకమాసం తొలి సోమవారం నేపథ్యంలో ముక్కంటి ఆలయా నికి భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు



నిందితులను సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవి భాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రచం దనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల చొప్పున జైలు శిక్షతో పాటు రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసిం హమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన సుబ్రమణి సతీష్ కుమార్, తిరువణ్ణామలైకి చెందిన కుల్లయన్ వెంక టేష్ ఎర్రచందనం చెట్లను నరికేందుకు తిరుపతి అటవీశాఖ పరిధిలోని పెరు మాళ్లపల్లె, టీఎన్‌పాళెంలోని శేషాచల అడవిలోకి ప్రవేశించారు. వీరిని పట్టు కున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. వీరిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల జరి మానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఇద్దరు స్మగ్లర్లను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ వాదనలు వినిపించారు. ఎర్రచందనం చెట్లను నరికేందుకు అక్రమంగా ప్రవేశించే వారికి.. ఈ తీర్పు ఓ హెచ్చరిక అవుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

రెండు కిలలో గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిని తిరుపతి పోలీసులు సోమవారం అరెస్టుచేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకు న్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. తిరుపతి కోలా వీధికి చెందిన షేక్ సందానీ, చిన్నం చెట్టి బద్రినాథ్, గిరిపురానికి చెందిన ధనుష్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరిలో షేక్ సందానీ కొద్దిరోజుల క్రితం వైజాగ్ వెళ్లి కిలో రూ.7500 చొప్పున రెండు కిలోల గంజాయి కొన్నాడు. రైలులో విజ యవాడకు.. అక్కడ్నుంచి బస్సులో రేణిగుంటకు చేరుకున్నాడు. మిగతా ఇద్దరూ స్కూటర్‌లో అక్కడికి చేరుకుని.. గంజాయితో పాటు సందానీని తీసు కుని తిరుపతికి బయలుదేరారు. ఈ గంజాయిని చిన్న పొట్లాలు చేసి, పొట్లం రూ.200 నుంచి, 300కు అమ్మాలన్నది వీరి ఉద్దేశం. దీనిపై అందిన సమాచా రంతో డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది రామానుజ సర్కిల్ వద్ద కాపుకాసి వారిని పట్టుకున్నారు.



అనుసంధానం చేసేందుకు వ్యాబ్‌కు తరలిస్తున్న సీఎంఎస్-03 ఉపగ్రహం - రాకెట్ మొదటి దశ - రాకెట్ రెండో దశ - రాకెట్ మూడో దశ

రెండో ప్రయోగ వేదికపై ఎల్వీఎం3-ఎం5 రాకెట్



మరో ప్రయోగానికి షార్ సిద్ధం

మరో ప్రయోగానికి షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సిద్ధమైంది. ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 4,400 కిలోల బరువైన సీఎంఎస్-03 (జీశాట్-7ఆర్) కమ్యూ నికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు శాస్త్రవే త్తలు సర్వం సిద్ధం చేశారు. వ్యాబ్‌లో రాకెట్ అనుసంధాన పనులు పూర్తి చేసి రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలించారు. సోమవారం లెవల్ 1, లెవల్ 2 తనిఖీలు చేసి పలు పరీ క్షలు చేశారు. కాగా, రాకెట్‌ను దశలవారీగా అనుసంధానించిన ఫొటోలను ఇస్రో సోమ వారం విడుదల చేసింది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



వ్యాబ్ నుంచి రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలిస్తున్న దృశ్యం

వాహనంపై పడిన వృక్షం



వి.కోట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వి.కోట-పలమనేరు ప్రధాన రహదారిలో కస్తూరినగరం వద్ద రోడ్డు పక్కనున్న భారీ నీలగిరి చెట్టు అటుగా వెళ్తున్న బొలెరో వాహనం మీద పడింది. గాలుల తాకిడికి ఈ చెట్టు నేలకొరిగింది. అదృష్టవశాత్తూ అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు ఆ చెట్టును పోలీసుల సాయంతో పక్కకు తీశారు. వాహనం పూర్తిగా దెబ్బతింది. గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ పునరుద్ధరించారు.

వెలుగు వీవోఏ సంఘ అధ్యక్షుడిగా నాగరాజు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెలుగు వీవోఏ(యానిమేటర్స్) సంఘం అధ్యక్షుడిగా బైరెడ్డిపల్లె మండలం దేవదొడ్డికి చెందిన నాగరాజు ఎన్నికయ్యారు. కాణిపాకంలో జరిగిన వెలుగు వీవోఏల జిల్లా మహాసభలో సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాగరాజు సోమవారం తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల హుండీల్లో చోరీ



పొలాల్లో పడేసిన హుండీ

సదుం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బూరగమంద పంచాయతీ రామాపురంలోని కోదండరామస్వామి ఆలయం, గాండ్లపల్లెలోని అభయ ఆంజనేయ స్వామి, రామాలయాల్లో ఆదివారం రాత్రి చోరీలు జరిగాయి. దుండగులు హుండీలను తీసుకెళ్లి పగలగొట్టి సొమ్ము అపహరించారు. హుండీని పంట పొలాల్లో విడిచి వెళ్లారు. మూడు ఆలయాల్లోనూ సుమారు రూ.20 వేల వరకు చోరీ జరిగినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గత నెలలోనూ మండల పరిధిలోని జోగివారిపల్లెలో వేంకటేశ్వర స్వామి ఆలయం, చెరుపువారిపల్లె శివాలయంలోనూ హుండీలను ఎత్తుకుపోయారు. ఈ సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మొరవల వద్ద బందోబస్తు



చెన్నపట్నం చెరువు వద్ద పోలీసుల నిఘా

సోమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు గార్గేయనది ఉధృతంగా ప్రవహిస్తోంది. చెన్నపట్నం చెరువు జలకళ సంతరించుకుని మొరవ పోతోంది. తహసీల్దార్ మధుసూదన్ సూచనలతో ఇక్కడ ఎస్‌ఐ శివశంకర పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చెన్నపట్నం చెరువుకు సందర్శకులు పెరగడంతో మొరవ వద్దకు ఎవరినీ వెళ్లనీయడం లేదు. ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ మధుసూదన్ సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి చిన్నపిల్లలను చెరువులు, కుంటల వద్దకు వెళ్లనీయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సచివాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్రిమూర్తికి నేతల నివాళి





త్రిమూర్తికి నివాళులర్పిస్తున్న మునిరత్నం, టీడీపీ నేతలు (ఇన్‌సెట్లో) త్రిమూర్తి(ఫైల్ ఫొటో)

గుడుపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన యామిగానిపల్లె వాసి త్రిమూర్తి (58) మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీ.ఎస్.మునిరత్నం, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ నేతలు గ్రామానికి చేరుకుని త్రిమూర్తి మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల, అఖిల పక్షం నేతల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ మునిరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, వన్నెకుల కార్పొరేషన్ డైరెక్టర్ అరుణాచలం, రామచంద్రుడు, అమీర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బారి నుంచి రక్షించండి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏనుగుల బారి నుంచి రైతులను, పంటపొలాలను రక్షించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాపతి నాయుడు అటవీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం డీఎఫ్‌వో సుబ్బరాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో 3.40 లక్షల కుటుంబాల రైతులు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. గజదాడుల కారణంగా పలమనేరు, కుప్పం, రామకుప్పం, పులిచెర్ల, సోమల, ఐరాల, కల్లూరు, చంద్రగిరి ప్రాంతాల్లో పంటలు ఎక్కువగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులు, అడవి జంతువుల బారి నుంచి తమను, పంట పొలాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాక్టరు కింద పడి టీడీపీ కార్యకర్త మృతి





వెంకట్రామయ్య మృతదేహం, (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండల టీడీపీ ఉపాధ్యక్షుడు ఇ.కుమార్ తండ్రి వెంకట్రామయ్య (57) ఆదివారం రాత్రి ట్రాక్టరు కింద పడి మృతి చెందారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ పంచాయతీ చింతలగుంట కాలనీకి చెందిన ఇ.వెంకట్రామయ్య(57) ఆదివారం రాత్రి సుమారు 9.30 గంటల ప్రాంతంలో ఇదే మండలంలోని బాలుపల్లె నుంచి ట్రాక్టరులో డ్రైవర్ పక్కన కూర్చొని వస్తుండగా, ట్రాక్టరు కుదుపుకు కింద పడ్డారు. ఈ క్రమంలో ట్రాలీ ఆయన మీదకు ఎక్కి దిగడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై మృతుడి కుమారుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. సోమవారం శవపరీక్ష అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ తెలిపారు.

కుప్పంలో భూగర్భ విద్యుదీకరణ



కుప్పం బైపా‌స్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక విద్యుత్తు స్తంభాలు

కుప్పం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో భూగర్భ విద్యుదీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. కుప్పం-పలమనేరు జాతీయ రహదారికి ఇరువైపులా అమరుస్తున్న విద్యుత్తు స్తంభాలను భూగర్భ విద్యుదీకరణ పద్ధతిలో చేస్తున్నారు. స్టైలిష్‌గా, పొడవుగా ఉండే ఈ స్తంభాలకు సరికొత్త విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. కుప్పం ప్రభుత్వ ఆస్పత్రి కూడలి నుంచి మొదలుపెట్టి, శ్మశానం వద్దగల కృష్ణగిరి సర్కిల్ వరకు ఇప్పటికే కొత్త విద్యుత్తు స్తంభాలు, దీపాలు అమర్చారు. మళ్లీ ఇప్పుడు బీసీఎన్ రీసార్ట్ కూడలి నుంచి మల్లానూరు మలుపులోని కూడలి వరకు అమర్చడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి విద్యుత్తు స్తంభానికి దీపాలు ఉన్న ప్రాంతంలో స్వర్ణ కుప్పం అని రాసిన బోర్డును ఏర్పాటు చేశారు. ఇవన్నీ ఒక ఎత్తైతే బైపా‌స్‌లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్తు స్తంభాలపై ఒక్క విద్యుత్తు తీగ సైతం కనిపించడం లేదు. గతంలో ఉన్న విద్యుత్తు స్తంభాలకు అనేక తీగలు మెలిపడి కిందికి వేలాడుతూ అస్తవ్యస్తంగా ఉండేవి. చిన్నగాలి వీచినా ఒకదానికి మరొకటి తగిలి విద్యుత్తు రవ్వలు రేగడమే కాక, తరచూ షార్ట్ సర్క్యూట్ అయి గంటల తరబడి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడేది. ఈ పాత విద్యుత్తు స్తంభాలను పూర్తిగా తొలగించి ఏర్పాటు చేస్తున్న సరికొత్త స్తంభాలకు విద్యుత్తు తీగలను భూగర్భంలోనే ఏర్పాటు చేశారు.దీంతో విద్యుత్తు తీగలు బయట కనిపించకపోవడమే కాక, తీగల గజిబిజితో తరచూ ఏర్పడే షార్ట్ సర్క్యూట్, అందువల్ల కలిగే విద్యుత్తు సరఫరా లోపాల సమస్యలు తీరాయి. ఆధునిక విద్యుత్తు స్తంభాల ఏర్పాటుతో కుప్పం మున్సిపాలిటీకి సరికొత్త సొబగులు చేకూరాయి.

పంటలపై కొనసాగుతున్న గజ దాడులు

● పాళెం, దేవళంపేట పంచాయతీల్లో పంటల ధ్వంసం



మామిడి కొమ్మను విరిచేసిన ఏనుగులు

కల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజ దాడులు కొనసాగుతున్నాయి. పాళెం, దేవళంపేటపంచాయతీల్లో ఆదివారం రాత్రి రెండు గ్రూపులుగా ఏర్పడిన ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్ప చెరువు, కోటరాళ్ల వద్ద సంచరిస్తున్న ఆరు ఏనుగుల గుంపులో నాలుగు ఏనుగులు పాళెం పంచాయతీ జూపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు వెంకటరమణ, బాబు, శివ, రఘుకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. సమీపంలోని పశుగ్రాసం తినేశాయి. పాళెంలోని మాజీ జడ్పీటీసీ మురళిధర్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగులు అక్కడి నుంచి అడవిలోని చింతలవంక వద్దకు చేరుకున్నాయి. మరో జంట ఏనుగులు దేవళంపేట పంచాయతీ దిగుమూర్తివారిపల్లికి చేరుకున్నాయి. రైతులు రెడ్డిప్రసాద్, వెంకట్రామయ్య, శంకర్, బాలచంద్రకు చెందిన రాగి, జొన్న, సజ్జ, మొక్కజొన్న, పశుగ్రాసాన్ని ఇవి ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి జంట ఏనుగులు సూరప్ప చెరువు వద్దకు చేరుకున్నాయి. నష్టం వాటిల్లిన పంటలను అటవీశాఖ సిబ్బంది సోమవారం పరిశీలించారు.

విద్యుత్ ఉద్యోగులకు సెలవులు రద్దు

మరో రెండు రోజులు



చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్‌లో విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈఈలు మునిచంద్ర, సురేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం వారు కార్యాలయాల్లో వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. మరో రెండు రోజుల పాటు సెలవులు ఎవరికీ ఇవ్వడం జరగదని, సెలవుల్లో ఉన్నవారు కూడా విధులకు హాజరవ్వాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు అందుబాటులోనే ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే ప్రజలు వెంటనే 1912 నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, ఇతర పరికరాలు అందుటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యను గుర్తించిన వెంటనే విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని అన్నారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి రెండోమార్గం ఏర్పాటుకు చర్యలు



రెండోమార్గంపై ఆస్పత్రి చుట్టూ పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్, కమిటీ సభ్యులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి ప్రస్తుతం ఉన్న దారితో పాటు మరో దారి ఏర్పాటుపై అధికారులు పరిశీలన చేపట్టారు. గతంలో ఆస్పత్రికి రెండుదారులుండగా ఒక దారి అన్యాక్రాంతమైంది. ప్రస్తుతం చర్చివీధి మీదుగా ఒకేదారి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో గంగనపల్లె చింతమాను సర్కిల్ నుంచి ఆస్పత్రికి రెండవ దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జగన్మోహన్ అధికారులకు సూచించారు. కమిషనర్ నరసింహప్రసాద్, అపోలో ఆస్పత్రి సీవోవో నరే‌ష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజే‌ష్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప, పీఏ కుమార్, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు అపోలో కాలేజీలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమంపై చర్చించారు.

ఇటుకబట్టీలో వెట్టిచాకిరి చేస్తున్న కుటుంబానికి విముక్తి



మణి కుటుంబంతో తహసీల్దార్ శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బుక్కాపట్నం గ్రామానికి సమీపంలో ఓ ఇటుకబట్టీలో వెట్టిచాకిరి చేస్తున్న ఒక కుటుంబానికి యజమాని నుంచి విముక్తి కల్పించిన వైనం సోమవారం జరిగింది. గంగాధరనెల్లూరు మండలం బుక్కాపట్నం గ్రామ సమీపంలో గుట్ట వద్ద పుష్పరాజ్ ఇటుకబట్టీ వ్యాపారం చేస్తున్నాడు. కాగా తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా ఉత్తంగరై తాలుకా వభాగవలస గ్రామానికి చెందిన మణి, అతడి భార్య, నలుగురు పిల్లలతో ఇటుకల తయారీ పనిచేయించుకునేందుకు రూ.20వేలు అడ్వాన్స్ ఇచ్చి బుక్కాపట్నం తీసుకొచ్చాడు. వారిని ఇంటికి పంపకుండా ఇటుకబట్టీ తయారుచేసే షెడ్డులో పెట్టి పని చేయించుకుంటున్నారు. సక్రమంగా కూలీ చెల్లించకుండా నిర్బంధంతో వెట్టిచాకిరి చేయిస్తున్నాడు. జీవనజ్వాల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గమనించి చిత్తూరు ఆర్డీవోకి ఫిర్యాదుచేయగా, ఆర్డీవో ఆదేశాల మేరకు బుక్కాపట్నం గుట్ట వద్ద గల ఇటుకబట్టీ వద్దకు సోమవారం పోలీస్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాసులు వెళ్లారు. తమిళనాడుకు చెందిన కుటుంబానికి యజమాని నుంచి విముక్తి కల్గించి, వారిని స్వగ్రామానికి పంపించారు.

జడ్పీలో ఐదుగురికి పదోన్నతి

చిత్తూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జడ్పీ పరిధిలో ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పత్రాలను జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో రవికుమార్ నాయుడు కలిసి అందజేశారు.

తుఫాన్ సహాయక పనుల్లో ఎస్పీడీసీఎల్ ఉద్యోగులు



శ్రీనివాసమూర్తి

పుంగనూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో భాగంగా ఎస్పీడీసీఎల్ డివిజన్ నుంచి 45 మంది అధికారులు, ఉద్యోగులు విశాఖ, కాకినాడలకు వెళ్లినట్లు డీఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి సీఎండీ శివశంకర్, చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ ఆదేశాల మేరకు పుంగనూరు, పలమనేరు, సదుం, కుప్పం సబ్‌డివిజన్ల నుంచి 45మంది వెళ్లారన్నారు. కుప్పం, సదుం ఏడీఈలు చిన్నబ్బ, నరేంద్ర, కల్లూరు ఏఈఈ పురుషోత్తం పర్యవేక్షణలో ఉద్యోగులు పనిచేస్తారన్నారు. రాజమండ్రి, అమలాపురం, విశాఖ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ పనుల్లో పాల్గొంటారన్నారు. తుపాను నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండాలని, తడి చేతులతో విద్యుత్ పరికరాలు ముట్టుకోరాదని సూచించారు.

సచివాలయాల్లో సిబ్బంది ఏరీ?



సిబ్బంది లేక ఖాళీగా వున్న తాళంబేడు గ్రామ సచివాలయం



మహిళా పోలీస్ మాత్రమే ఉన్న పాలూరు సచివాలయం

చిత్తూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):చిత్తూరు రూరల్ మండలంలోని సచివాలయాలన్నీ సోమవారం సిబ్బంది లేక బోసిపోయాయి.పర్యవేక్షించాల్సిన మండల అభివృద్ధి అధికారులు పట్టించుకోకపోవడంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా కార్యాలయాలకు వచ్చిపోతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.చింతలగుంట సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే వుండగా బీఎస్ఆర్ పేట సచివాలయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు కూడా వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్ తప్ప మిగిలిన సిబ్బంది కన్పించలేదు. ఈ సచివాలయానికి కూతవేటు దూరంలో నీవా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నదిపై జీడీనెల్లూరు - చిత్తూరు రూరల్ మండలానికి వెళ్లే రోడ్డు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయింది. ఇలాంటి ఘటనలను నివారించేందుకు స్థానిక పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండాలి. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కొంత మంది స్థానికులు ప్రమాదకరంగా ఉన్న నదిని దాటే ప్రయత్నం చేస్తున్నారు. తాళంబేడు సచివాలయాన్ని ఆనుకొనే పెద్దవంక రోడ్డుపై ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. ప్రజలను అప్రమత్తం చేయాల్సిన సిబ్బంది సచివాలయంలో అందుబాటులో లేకపోవడం దారుణం. ఈ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ తప్ప మరెవరూ కన్పించలేదు. పాలూరు సచివాలయంలో కూడా మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ తప్ప ఎవరూ సచివాలయానికి రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో పరశురాంను అడగ్గా స్వామిత్వపై డీపీవోలో సమావేశానికి కొంతమంది హాజరయ్యారని, మిగిలిన వారు ఎందుకు సచివాలయాలకు రాలేదో తెలుసుకుంటానని చెప్పుకొచ్చారు.

100 రైలు సర్వీసుల రద్దు!

● మొంథా తుఫాన్ ఎఫెక్ట్.. రవాణా బంద్

● రైళ్లన్నీ ఎక్కడివి అక్కడే నిలిపివేత

విజయవాడ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం కారణంగా మంగళవారం కోస్తా జిల్లాల మీదుగా నడిచే 95 రైళ్ల సర్వీసులను విజయవాడ డివిజనల్ రైల్వే రద్దు చేసింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైళ్లు రద్దు చేసినట్టుగా ప్రకటించింది. ఈ మేరకు వేర్వేరుగా మూడు బులెటిన్లు విడుదల చేసింది. వీటితో పాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో.. విజయనగరం, విశాఖపట్నం మీదుగా రాజమండ్రి, మచిలీపట్నం, గుంటూరు, తిరుపతి, చెన్నై, సికింద్రాబాద్‌లకు వెళ్లే కొన్ని రైళ్లను రద్దు చేశారు. దీంతో కోస్తా జిల్లాల పరిధిలో 100కు పైగా రైలు సర్వీసులు రద్దు కావడం గమనార్హం. వీటిలో తిరుపతి మీదుగా ప్రయాణించే తిరుపతి -విశాఖపట్నం(08584), తిరుపతి-విశాఖపట్నం(22708), చెన్నై సెంట్రల్-విశాఖపట్నం(22870), తిరుపతి-పూరి(17480), పూరి -తిరుపతి (17479), కడప-విశాఖపట్నం(18522) రైళ్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఉద్యోగ నాయకులు విరాళాలు ప్రకటించకండి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ నాయకులు తుఫాన్ బాధితుల సహాయార్థం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఒక రోజు జీతాన్ని విరాళంగా ప్రకటించవద్దని ఏపీ జేఏసీ అమరావతి మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

'మొంథా' పట్ల అప్రమత్తంగా ఉండండి

● డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు

● సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా వుండాలని సీఎండీ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించాం. సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. తుపాను తీరం దాటేవరకు అందరికీ సెలవులు రద్దు చేశాం. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. విద్యుత్ స్తంభాలు ఒరిగిన వెంటనే మరమ్మతులు చేయడానికి సిద్ధంగా ఉండాలి. కూలీలను అందుబాటులో ఉంచుకోవాలి. విద్యుత్ స్తంభాలు పడిపోయినపుడు, వైర్లు తెగినపుడు ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి టోల్ ఫ్రీ నెంబర్లు 1912 లేదా 1800 425 155333 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. సంస్థ వాట్సాప్ నెంబరు 91333 31912కు చాట్ చేయాలి' అని ఆ ప్రకటనలో సీఎండీ సూచించారు.

గుండెపోటుతో వెటర్నరీ అసిస్టెంట్ మృతి



బాలకృష్ణ (ఫైల్‌ఫొటో)

వి.కోట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చింతమాకులపల్లె సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ బాలకృష్ణ గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం స్వగ్రామం గంగవరం మండలం కీలపట్లకు వెళ్లారు. కుటుంబ సభ్యులతో కలసి బయటకు వస్తూ కుప్పకూలాడు. వైద్యుల వద్దకు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ యువరాజ్‌ల సూచనమేరకు సోమవారం ఏవో శంకర్, ఇతర సిబ్బందిలో వెళ్ళి మృతుని భార్యకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని అందించారు.

పారిశుధ్య స్పెషల్ డ్రైవ్



కుప్పం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువల్లో పూడికను తొలగించారు. దీంతో మురుగు ప్రవాహం సాఫీగా సాగుతోంది. వానల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

పలమనేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా రైతు సంఘ నాయకుడు ఉమాపతి నాయుడు కోరారు. ఆయన సోమవారం జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అటవీ సరిహద్దు గ్రామాల్లో పంటలను ఏనుగులు తిని, తొక్కి నాశనం చేస్తున్నాయన్నారు. రైతులను చంపివేస్తున్నాయన్నారు.వందకు పైగా ఏనుగులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయన్నారు. ఇకనైనా ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళకు తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఎ.కొత్తకోట వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ఓ మహిళ సోమవారం తీవ్రంగా గాయపడింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు.. మార్లపల్లెకు చెందిన బాబు, భార్య దేవిలు ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా ఏ కొత్తకోట సమీపంలో దేవి చీర ద్విచక్రవాహనం వెనుక చక్రానికి చుట్టుకుంది. దీంతో వాహనం పడిపోవడంతో దేవికి తీవ్రగాయాలయ్యాయి. తలకు గాయం కావడంతో ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనతో తిరుపతి తరలించారు.

శైవక్షేత్రాల్లో కార్తీక శోభ



భోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

పుంగనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో పుంగనూరు, పరిసర ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. స్థానిక కోనేరు వద్ద అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, ప్రైవేటు బస్టాండ్ వద్ద భోగనంజుండేశ్వరస్వామి, బజారువీధిలోని బసవేశ్వర స్వామి, అఘోరవీరభద్రస్వామి, నగరిలో ప్రసన్నపార్వతీదేవి సమేత సోమేశ్వరస్వామి తదితర ఆలయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో పార్వతీపరమేశ్వరులు, బసవేశ్వరస్వామి, నీలాంబికాదేవీ, వీరభద్రస్వామి, భద్రకాళీదేవీ, గణపతి ఉత్సవమూర్తులకు భక్తులు పూజలు చేశారు.

సోమల: కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా దుర్గం కొండలో అభిషేకపూజలు, అర్చనలు జరిపారు. పలువురు శివమాల ధరించారు. సోమల స్వయంభేశ్వరస్వామి , కందూరు, తమ్మినాయనపల్లె, వల్లిగట్ల, రాశెట్టివారిపల్లె, పగడాలవారిపల్లె, మల్లేశ్వరపురం, రెడ్డివారిపల్లె, పెద్దఉప్పరపల్లె, ఇరికిపెంట మల్లేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు దర్శించుకున్నారు.

కల్లూరు: చంద్రమౌళీశ్వరస్వామి,దేవళంపేట కాశీవిశ్వేశ్వరస్వామి, జాండ్రపేట,కావేటిగారిపల్లి మల్లేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, నిర్వహించారు. **రొంపిచెర్ల:** కట్టకిందశివాలయంలో, పెద్దగొట్టిగల్లు ఓంకారేశ్వరస్వామి, మోటుమల్లెల కాశీవిశ్వేశ్వరస్వామిఆలయాల్లో పూజలు చేశారు. మహిళలు కేదారవ్రత నోముల్లో పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

చౌడేపల్లె, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): జూదం ఆడుతున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. వారి నుంచి రూ.5,050 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పుంగనూరు రూరల్: పట్టణ సమీపంలోని భగత్ సింగ్ కాలనీలో సోమవారం జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.2500 స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి



కంగుందిలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

కుప్పం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని టీడీపీ నాయకులు అన్నారు. చందం, దాసేగౌనూరు, కంగుంది, మోట్లచేను, సదుమూరు, మల్లానూరు, చెక్కునత్తం, పైపాళ్యం పంచాయతీల్లో సోమవారం టీడీపీ పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశాలు జరిగాయి. ఏపీఐసీసీ డైరెక్టర్ కంగుంది క్లస్టర్‌లో జరిగిన సమావేశాలను ప్రేమ్‌కుమార్, మల్లానూరు క్లస్టర్‌లో జరిగిన సమావేశాలను కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రామచంద్ర, వెండుగంపల్లె క్లస్టర్‌లో జరిగిన సమావేశాలను మండల టీడీపీ అధ్యక్షుడు రాజగోపాల్‌లు పర్యవేక్షించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం ఈ సమావేశాలను సమన్వయం చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులకు నివేదించి పరిష్కరించాలన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

కల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రంలోని ఇస్తరాకులపల్లిలో ఓ ఇల్లు పాక్షికంగా కూలింది. వర్షాలకు ఇంటి గోడలు కూలిపోయాయని బాధితురాలు పుష్ప చెప్పింది. తహసీల్దార్ జయసింహ వెళ్లి బాధితురాలికి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఆ కుటుంబాన్ని పునరావాస కేంద్రానికి తరలించారు. తుపాను దృష్ట్యా తమ కార్యాలయంలో 24 గంటలు సేవలందించేలా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని జయచంద్ర తెలిపారు. తడిసిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదన్నారు. ఎంపీడీవో రాజశేఖర్ కల్లూరులో పర్యటించారు.

తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత



నీటిని పరిశీలిస్తున్న రమణారెడ్డి

పలమనేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వర్షాల నేపథ్యంలో ముంపు అవకాశమున్న ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సోమవారం సందర్శించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. దండపల్లిరోడ్డు,లక్ష్మీనగర్,శ్రీనగర్‌కాలనీల్లో వెట్‌మిక్స్ ద్వారా గుంతలను పూడ్చివేయించారు. . ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలందరూ కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. ఎద్దుల సంతం సంపు వద్ద ఈఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకును సందర్శించారు.

ఏఎంసీ చైర్మన్ శమీపతికి సత్కారం



శమీపతిని సత్కరిస్తున్న వ్యాపారులు

పుంగనూరు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి వ్యాపారస్తులు సహకరించాలని ఏఎంసీ చైర్మన్ శమీపతి కోరారు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో టమోటా వ్యాపారస్తులు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. లైసెన్స్ లేని వ్యాపారస్తులు ఉదయాన్నే ఏఎంసీ ఆవరణలో కూరగాయల వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఉదయం వ్యాపారాలకు తమకు సంబంధం లేదని ఏఎంసీ కార్యదర్శి గోపినాథ్ చెప్పడంతో వ్యాపారస్తులు మండిపడ్డారు. చైర్మన్ మాట్లాడుతూ లైసెన్స్ వ్యాపారస్తులే వ్యాపారాలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు సొంత నిధులతో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

తీర్థయాత్రకు వెళ్లి అదృశ్యం

పుంగనూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటుకనెల్లూరు గ్రామానికి చెందిన లోకేశ్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 2న తీర్థయాత్రలకు వెళ్లాడు. తర్వాత తిరుపతిలో ఉన్నట్లు ఫోన్‌లో చెప్పిన తమ కుమారుడు ఇంతవరకు ఇంటికి రాలేదని, ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చల్లాపై నిరాధార ఆరోపణలు చేయడం తగదు



మాట్లాడుతున్న ఉయ్యాల రమణ, పార్టీ నాయకులు

రొంపిచెర్ల,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డిపై నిరాధార ఆరోపలు చేయడం తగదని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ అన్నారు. చ కొంతమంది సామాజిక మాధ్యమంలో అసత్యాలతో పెడుతున్న నకిలీ ఆడియోలను విశ్వసించవద్దన్నారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఫేక్‌ఆడియోలను నమ్మే పరిస్థితులలో నియోజకవర్గ ప్రజలు లేరన్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి నీతిమాలిన చర్యలకు దిగుతున్నారన్నారు. చల్లా కుటుంబం రాజకీయ ఎదుగడం సహించలేక కొందరు అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. నాయకులు మదనమోహన్‌రెడ్డి, శేషాద్రినాయుడు, అమరనాథరెడ్డి, చెంగల్‌రెడ్డి, రామమూర్తి, మదనమోహన్, మెకానిక్‌రఫీ, కిరణ్‌గౌడ, సిద్దయ్య, నాగరాజ భాస్కర పాల్గొన్నారు.

బుటకపల్లె చెరువు గండి పూడ్చండి

చౌడేపల్లె, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): వర్షాలకు బుటకపల్లె చెరువుకు గండి పడింది. దుర్గసముద్రం పంచాయతీలోని సుమారు 90 ఎకరాల ఆయకట్టు ఉన్న బుటకపల్లె చెరువు కట్టకు నాలుగు రోజుల క్రితం గండి పడింది. చెరువుకట్ట తెగితే సుమారు 350 ఎకరాలలో వరి పంట నీట మునుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.పరికిదోన పంచాయతీలోని బాలప్ప కుంట కట్ట దెబ్బ కావటంతో నీరు లీకవుతోంది.

31 లోపు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఈనెల 31వ తేదిలోపు ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఆధార్ ఎన్‌రోల్మెంట్ సూపర్‌వైజర్ నందకుమార్ తెలిపారు. సోమవారం అడవినాథునికుంట ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ఆధార్‌కార్డులపే అప్‌డేట్ చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి బసవరాజ, వీఆర్వో భాస్కర్‌రెడ్డి, సదానందరెడ్డి, పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లెలో చురుగ్గా పారిశుధ్య పనులు

పెద్దపంజాణి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు పంచాయతీ బ్రాహ్మణపల్లెలో ఎంపీడీవో బాలాజి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చురుగ్గా జరగుతున్నాయి. ఇక్కడి పారిశుధ్యం తీరుపై సోమవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన వార్తకు మండల అధికారులు స్పందించారు. గ్రామంలో పర్యటించి మురుగునీటి కాలువలను శుభ్రం చేయించా రు. పేరుకుపోయిన మురుగునీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వైద్యశిబిరం ఏర్పాటు చేయిస్తామన్నారు.

నేరెళ్ల చెరువు గండి పూడ్చివేత

సదుం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బూరగమంద పంచాయతీ పచ్చార్లమాకులపల్లె నేరెళ్ల చెరువుకు గండి పూడ్చారు. దీనిపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ డీఈ రాజేంద్రప్రసాద్ స్పందించారు. సోమవారం సుమారు వంద ట్రాక్టర్ల మొరం మట్టితో గండిని పూర్తిగా పూడ్చి వేయించారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

బైరెడ్డిపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ి రూరల్ సీఐ పరశురాముడు తెలిపారు. బైరెడ్డిపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ వల్ల నష్టం జరగకుండా అన్నిశాఖల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాగులు, వంకలు, విద్యుత్‌స్తంభాలు, పాతభవనాలు, రహదారులు లేదా మరే సమస్య ఎదురైనాసమాచారం అందజేయాలన్నారు. వాగులు, వంకలు, చెరువులవద్దకు పిల్లలు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువుకట్టలు ప్రమాదకరంగా ఉంటే వెంటనే సమాచారమివ్వాలన్నారు.

వర్షాలకు కూలిన పూరి గుడిసె గోడ

● ఇబ్బంది పడుతున్న కుటుంబ సభ్యులు



కూలిపోయిన గోడను చూపుతున్న బాధితులు

పాలసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం టీవీఎన్‌ఆర్ పురం గ్రామానికి చెందిన కేశవమండడి కుటుంబం వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో పూరి గుడిసెలోనే జీవిస్తున్నారు. వర్షాలకు ఆదివారం రాత్రి పూరి గుడిసెకు ఉన్న మట్టి గోడ కొంత భాగం కూలి పోవడంతో ఆ కుటుంబం దీనావస్థలో జీవిస్తోంది. గుడిసె కూలిన విషయం అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఏనుగుకొండయ్యపల్లి చెరువును పరిశీలిస్తున్న ఎస్‌ఈ ప్రసన్నకుమార్

పెనుమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలో తాగునీరు అందించే బోర్లు వర్షాలకు చెరువుల్లో మునిగిపోయాయి. అలాంటి గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్, ఈఈ విజయ్‌కుమార్‌లు సూచించారు. ఆంధ్రజ్యోతిలో ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి అనే వార్తకు స్పందించిన అధికారులు సోమవారం మండలంలోని చెరువుల్లో మునిగిపోయిన బోర్లను పరిశీలించారు. వాటికి బదులుగా మరో బోర్లలో మోటార్లు అమర్చి తాగునీరు అందించాలని సూచించారు. ఇందుకు జడ్పీ నిధులు కూడా సీఈవో మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ నందకిషోర్, ఏఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా సూరసంహారం వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

నగరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో సూరసంహారం పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో 6వ రోజు షష్ఠి కావడంతో ఆలయాలు హరోంహర నామస్మరణతో మారుమోగాయి. భక్తులు సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో 108 సార్లు ప్రదక్షిణ చేశారు. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలో వళ్లీ దేవసేన సమేత ఆర్ముగ స్వామికి చందన, పంచామృతాభిషేకాలు చేసి ప్రత్యేకంగా కలువ, చామంతి పూలతో సుందరంగా అలంకరించారు. ఉత్సవ ఉభయదారులకు ఆలయ నిర్వాహకులు మర్యాదలు చేశారు. రాత్రి ఈశ్వరగుడి వీధిలో బాణసంచా పేల్చి సూరసంహారం కార్యక్రమం నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ



చిత్తూరు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు సోమవారం ఎంహెచ్‌వో లోకేష్ రెయిన్‌కోట్లను పంపిణీ చేశారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు వర్షాల నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం లేకుండా విధులు నిర్వహించడానికి వీలుగా నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న 500 మంది పారిశుధ్య కార్మికులకు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం సభ్యులకు రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. నగరపాలక పరిధిలోని మస్టర్‌పాయింట్లలో వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, మేస్త్రీలకు కూడా పంపిణీ చేశారు.

ముప్పు ప్రాంతాల్లో అధికారుల హెచ్చరికలు

నగరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వలన భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ముప్పు ఉన్న ప్రాంతాలైన చింతలపట్టెడ దళితవాడ, లింగీస్‌గుంట, నగరిపేటలో సోమవారం పర్యటించారు. అక్కడి నివాసితులను అప్రమత్తం చేశారు. వర్షం తాకిడి ఎక్కువగా ఉంటే సమీప పాఠశాలకు వెళ్లాలన్నారు. మున్సిపల్ పరిధిలోని 17 సచివాలయాల్లోనూ ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ప్రజలు తమ ఫిర్యాదుల కొరకు 9949563111, 7990299301, 9884288313 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా పంచాయతీ గదుల వేలం

పెనుమూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పెనుమూరు సంతగేటు పక్కన ఉన్న ఆరు పంచాయతీ గదులకు సోమవారం సచివాలయం ముందు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ముందుగానే పంచాయతీ కార్యదర్శి పేరుతో రూ.30 వేలు డీడీ చెల్లించిన వారు ఈ వేలంలో పాల్గొన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఢిల్లీబాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకటనరసింహ, సిబ్బంది సమక్షంలో వేలంపాటను కార్యదర్శి ప్రభుకిరణ్ నిర్వహించారు. మూడు సంవత్సరాలకు నిర్వహించిన వేలంలో గదులు దక్కించుకున్నవారు ఏడాదికి కలిపి మొత్తం నగదును వారం రోజుల్లో చెల్లించాలి. చెల్లించకపోతే రెండవ పాటదారులకు గదులను స్వాధీనపరుస్తారు. ఆరుగదులకు గాను పంచాయతీకి 3శాతం స్టాంప్‌డ్యూటీతో కలిపి రూ.4,26,420 ఆదాయం వచ్చిందని కార్యదర్శి తెలిపారు.

మొంథా ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

నింద్ర, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో మండలంలోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ తెలిపారు. అత్తూరు చెరువును తహసీల్దార్ ఈశ్వరయ్య పరిశీలించారు.

కొండ మల్లీశ్వరుడికి విశేష పూజలు

వెదురుకుప్పం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని విశేష పూజలు చేశారు.

పొంగిపొర్లుతున్న వాగులు



పాపిరెడ్డిపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పాపిరెడ్డిపల్లి, జీఎంఆర్‌పురం, వడ్డీకండ్రిగ, దాసరిగుంట, మిట్ట కండ్రిగ, ఎగువకమ్మకండ్రిగ గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎస్‌ఐ సుమన్ మాట్లాడుతూ భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చవటపల్లికి కొత్త రోడ్డు ఏర్పాటుకు కృషి

పూతలపట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చవటపల్లి గ్రామానికి నూతనంగా రోడ్డు ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానని తహసీల్దార్ రమేష్ బాబు అన్నారు. సోమవారం ఆయన నేషనల్ హైవే అధికారులతో కలిసి చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారిలోని చవటపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ కలెక్టర్, ఆర్డీవోలతో మాట్లాడి రోడ్డు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మునిరత్నం నాయుడు, నేతాజీ, బాబూరావు, యోగేష్, వేణుగోపాల్ నాయుడు, రెంఉన్యూ అధికారులు, నేషనల్ హైవే అధికారులు, చవటపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

పూతలపట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. పాకాల మండలం చెన్నుగారిపల్లె గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు ప్రతాప్, అదే గ్రామానికి చెందిన రాజేష్ ఆదివారం రాత్రి పని నిమిత్తం పూతలపట్టుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, వేము ఇంజనీరింగ్ కళాశాల సమీపాన తిరుపతి నుంచి చిత్తూరు వైపుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ప్రతాప్ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ప్రతాప్ మృతిచెందాడు. సీఐ కృష్ణమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్నాథపురంలో చోరీ

విజయపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు మూడు ఇళ్లల్లో చోరీకి ప్రయత్నించారు. ఎస్‌ఐ మహేష్‌బాబు కథనం మేరకు... రిటైర్డు ఆర్మీ అధికారి మోహన్‌కుమార్ తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ఆయన అప్పుడప్పుడు జగన్నాథపురం వచ్చి వెళ్లేవారు. ఆ ఇంటిలో ఎవరూ లేరని భావించి దొంగలు చోరీకి ప్రయత్నించారు. కానీ ఇంట్లో విలువైన వస్తువులు లేకపోవడంతో పక్కనే మూతపడి ఉన్న శ్యామలమ్మలో ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. అక్కడ కూడా ఏమీ లభించకపోవడంతో మంజుల ఇంట్లోకి వెళ్లి లక్ష రూపాయలు చోరీ చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

బురదలో పడ్డ కారు



బురద గుంటలో పడిన కారు

నగరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకుపేటలో సోమవారం వేకువజామున జాతీయ రహదారిపై వస్తున్న ఒక కారు అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న బురద గుంటలో పడిపోయింది. ఎం.కొత్తూరు నుంచి చెన్నైకి వెళుతుండగా తడుకుపేట వద్ద జాతీయ రహదారి పనులు జరుగుతున్న ప్రాంతంలో ఎదురుగా వస్తున్న బైక్‌ని తప్పించబోయే ప్రయత్నంలో కారు పక్కనే ఉన్న పల్లంలోకి పల్టీకొట్టి బురదగుంటలో పడింది. స్థానికులు పరుగులు తీసి కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అదృష్టవశాత్తు కారులో ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అతికష్టం మీద కారును బయటకు తీశారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

పాలసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వికటించిన విందు భోజనం తిని వనదుర్గాపురంలో అస్వస్థతకు గురైన వారికి సోమవారం గ్రామంలో డాక్టర్ మోహనకృష్ణ ఆధ్వర్యంలో వైద్య బృందం చికిత్సలు అందిస్తున్నారు. కొంత మందికి వాంతులు, విరోచనాలు అదుపులోకి వచ్చాయి. మరో పది మందికి తగ్గకపోవడంతో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వారికి చిక్సితలు చేస్తున్నారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ గుర్రప్ప, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

విజయపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో లోతట్టు ప్రాంతాలను తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్, ట్రాన్స్‌కో అధికారులు సోమవారం పరిశీలించారు. పన్నూరు ఆదిఆంధ్రవాడలో గతంలో ఇంటిలోకి వర్షపునీరు చొరబడిన ప్రాంతాలను, మహారాజపురం ఆదిఆంధ్రవాడలో పరిశీలించారు. వర్షపు నీరు నిలవకుండా ఎక్స్‌కవేటర్‌తో చెత్త తొలగించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

యాదమరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరితే వెంటనే సచివాలయ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. అత్యవసర సమయంలో 9491077020, 9951358533 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపునకు ఇందుశ్రీ



విద్యార్థిని అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి

చిత్తూరు సెంట్రల్(ఆంధ్రజ్యోతి): గుజరాత్ యూనివర్సిటీ హేమచంద్రాచార్య నార్త్ పఠాన్‌లో ఈనెల 31 నుంచి నవంబరు 9వ తేదీ వరకు నిర్వహించే ప్రీరిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపునకు ఎస్‌పీఎస్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.ఇందుశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ఇందుశ్రీని అభినందించారు.

కోతకు గురైన రోడ్డును పరిశీలించిన ఎస్పీ, కలెక్టర్



శెట్టిపారం, దొమ్మరమిట్టకు వెళ్లేదారిలో నీటి ప్రవాహానికి కల్వర్టు పక్కన కోతకు గురైన మట్టిరోడ్డు



రాళ్లు, మట్టితోలి తాత్కాలికంగా సిద్ధం చేసిన రోడ్డు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరు చెరువుకు వచ్చే నీటి ప్రవాహాన్ని, అదేవిధంగా శెట్టిపారం, దొమ్మరమిట్ట గ్రామాలకు వెళ్లే దారిలో మొరవనీటి ప్రవాహానికి కల్వర్టు పక్కన కోతకు గురైన మట్టి రోడ్డును కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడీలతో కలిసి చిత్తూరు జిల్లా స్పెషల్ ఆఫీసర్ గిరీషా సోమవారం పరిశీలించారు. గంగాధరనెల్లూరు మండలం బంగారెడ్డిపల్లె పంచాయతీ శెట్టిపారం, కడపగుంట పంచాయతీ దొమ్మరమిట్ట గ్రామాలకు వెళ్లే దారిలో చెరువు మొరవల ప్రవాహం ఉధృతికి కల్వర్టు పక్కన మట్టిరోడ్డు ఆదివారం ఉదయం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. స్థానికులు మొబైల్‌ఫోన్‌లో ఈ విషయాన్ని వీడియో, ఫొటోలు తీసి ప్రభుత్వవిప్ థామస్‌కు తెలియజేశారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే వాటిని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పంపించి, ఆ సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. శెట్టిపారం గ్రామస్తులు బంగారెడ్డిపల్లె పంచాయతీకార్యదర్శితో మాట్లాడి గ్రామానికి రాకపోకలు సాగించడానికి తాత్కాలికంగా ఇబ్బందులు లేకుండా కోతకు గురైన చోట రాళ్లు, మట్టి తోలారు. ఈ క్రమంలో సోమవారం మండలంలోని ఆత్మకూరు చెరువును, శెట్టిపారం, దొమ్మరమిట్ట గ్రామాలకు వెళ్లే దారిలో కల్వర్టు పక్కన కోతకు గురైన మట్టి రోడ్డును పరిశీలించారు. అనంతరం వారు పంచాయతీరాజ్ డీఈ ఆనందరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో మనోహర్ గౌడ్‌లతో చర్చించారు. చెరువు మొరవనీరు సజావుగా వెళ్లడానికి ప్రస్తుతంఉన్న కల్వర్టు సరిపోదని, త్వరలోనే పెద్ద కల్వర్టు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

నేడు శెట్టిపారంలో ప్రభుత్వవిప్ థామస్ పర్యటన

మండలంలోని బంగారెడ్డిపల్లె పంచాయతీ శెట్టిపారం, కడపగుంట పంచాయతీ దొమ్మరమిట్ట గ్రామాలకు వెళ్లే దారిలో చెరువు మొరవల ప్రవాహం ఉధృతికి కల్వర్టు పక్కన కోతకు గురైన మట్టిరోడ్డును మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వవిప్ థామస్ పరిశీలిస్తారు. అదేవిధంగా ముక్కళత్తూరు దళితవాడలో ఇల్లు దెబ్బతిన్న రాజేశ్వరికి ఆర్థిక సాయమందించనున్నారు.

నీవానదిపై గ్రామస్తుల తాత్కాలిక వంతెన



నీవానదిపై గ్యాస్ సిలిండర్ తీసుకొస్తున్న గ్రామస్తుడు

ఐరాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వర్షం కురిసి వంకలు సాగాయంటే ఆ గ్రామస్తులు అవస్థలు పడక తప్పదు. ఏళ్ల తరబడి ఈ తంతు ఇలానే నడుస్తోంది. పాలకులు గాని, అధికారులు గాని వీరిని పట్టించుకోరు. మండల శివార ప్రాంతమైన గుండ్లపల్లెకు సమీపంలో ఉన్న ఉప్పరపల్లె గ్రామస్తులు పాతపేట వద్ద ప్రవహిస్తున్న నీవానదిపై సోమవారం తాత్కాలిక వంతెనను నిర్మించుకున్నారు. వర్షం కురిసి వాగు పొంగితే ఈ గ్రామానికి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలకు వాగు పొంగి దారిలో కొంత భాగం కొట్టుకు పోయింది. కొట్టుకుపోయిన ప్రాంతం వద్ద విద్యుత్ పోల్‌ను ఏర్పాటు చేసి గ్రామస్తులు ప్రాణాలకు తెగించి నడుస్తున్నారు. రెండు నెలల క్రితం వేదగిరివారిపల్లెకు చెందిన మోతుకూరి సోమశేఖర్ నాయుడు తన సొంత నిధులు రూ.2 లక్షలు ఖర్చు చేసి గ్రామానికి ఏర్పాటు చేసిన దారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాతపేట వద్ద శాశ్వతంగా వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేలకొరిగిన 70 ఎకరాల వరి

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు



పెనుమూరు మండలంలో నేలకొరిగిన వరిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెనుమూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాలకు 70 ఎకరాల వరి నేలకొరిగి నీటిలో నానుతుంది. తిరుపతి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏరువాక శాస్త్రవేత్తలు సోమవారం మండలంలో పర్యటించారు. రామకృష్ణారావు, సరళ, వజంత, నాగమణి, హారతి, వ్యవసాయ అధికారి సుహార్‌లతలు చార్వాగానిపల్లి, తాటిమాకులపల్లి, కేసీపల్లి, కలిగిరి పంచాయతీల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. చాలా వరకు కోత దశలో వర్షం పడటంతో మొలకలు వచ్చాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని వారు పేర్కొన్నారు. వర్షానికి తడిసిన గింజలు మొలకెత్తకుండా ఉండటానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. పొలంలో నీరు నిలిచినట్లయితే పనలను గట్లపైకి తెచ్చుకుని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లాలని తెలిపారు. ● గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం, ఏఎల్.పురం, పేయన్నపల్లె, చీలాపల్లె గ్రామాల్లో నేలవాలిన వరి పంటను జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ రామకృష్ణారావు పరిశీలించారు. ఈ గ్రామాల్లో 55 ఎకరాల మేర వరిపంట నేల వాలినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. ● బంగారుపాళ్యం: మండలంలోని చీకూరుపల్లె, మహాసముద్రం, టేకుమంద, గొల్లపల్లె, వెలుతురుచేను గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు కోతదశలో ఉండి నీట మునిగిన వరి పంటను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి భారతి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఐదు గ్రామాల్లో 12 ఎకరాల మేర వరి పంట దెబ్బతిందని చెప్పారు. ● యాదమరి: మండలంలో మొత్తం 14.71 ఎకరాల్లో వరి పంటకు, ఒక ఎకరాలో వేరుశనగ పంటకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పెరుమాళ్ళపల్లి గ్రామంలోని సోమేశ్వర్‌రెడ్డికి చెందిన దెబ్బతిన్న వరిపొలాన్ని పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి సి.హెచ్.దీప, రైతుసేవా సహాయకులు వామ పాల్గొన్నారు. ● తవణంపల్లె: మండలంలోని నల్లిశెట్టిపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె, పుణ్యసముద్రం గ్రామాల్లో వరి పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏవో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో దంపతులపై దాడి



చికిత్స పొందుతున్న మునస్వామి

విజయపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మునస్వామి(57), అంజల(45) దంపతులపై దాడి చేసిన సంఘటన మండలంలోని ఎల్లసముద్రంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ మహేష్‌బాబు కథనం మేరకు... పశువులను మేపుతున్న మునస్వామిపై తాగిన మద్యం సీసా పగలగొట్టి చేతి వేళ్లపై, వీపుపై పొడిచి రక్తగాయాలు చేయడంతో అతడి భార్య అడ్డుకోవడానికి ప్రయత్నించింది. ఆమె చేతిపై కూడా రక్త గాయాలయ్యాయి. గాయపడిన వారిని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నింద్ర మండలం సెట్టేరి ఆదిఆంధ్రవాడకు చెందిన నరేష్, రాజేష్ కొంత కాలంగా ఎల్లసముద్రం ఆదిఆంధ్రవాడలో నివాసం ఉంటున్నారని, కొన్ని రోజుల క్రితం మునస్వామితో విభేదాలు చోటుచేసుకున్నాయని, ఈ క్రమంలోనే దాడి చేసి ఉండవచ్చని ఎస్‌ఐ తెలిపారు. దాడి చేసిన వ్యక్తితో పాటు నింద్ర మండలం పాదిరికి చెందిన జీవేష్, వెంకటేష్, తమిళనాడు అరక్కోణంకు చెందిన యోగేష్ ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. కాగా మద్యం, గంజాయి మత్తులో వారు తమపై దాడి చేశారని బాధితులు మునస్వామి దంపతులు ఆరోపించారు. రాత్రి పగలు తేడా లేకుండా రోడ్డుపైనే మద్యం సేవిస్తున్నారని, రోడ్డు నుంచి ఇంటికి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.

భక్తులతో కిటకిటలాడిన మొగిలి శివాలయం



భక్తులకు అన్నప్రసాదం వితరణ చేస్తున్న ఎంటీ దిలీప్ కుటుంబ సభ్యులు

బంగారుపాళ్యం, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మొగిలిలో వెలిసిన కామాక్షి సమేత మొగిలీశ్వరుడి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఎంటీ దిలీప్, పూర్ణిమ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆదర్శప్రాయుడు కొమరం భీమ్



కొమరం భీమ్ వర్ధంతిలో జెర్రీమడుగు వాసులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకే కాకుండా ప్రతి ఒక్కరికీ కొమరం భీమ్ ఆదర్శప్రాయుడని బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు అన్నారు. తెలంగాణ రాష్ట్రం అదిలాబాద్ జిల్లా గిరిజన తాండాకు చెందిన ఉద్యమ నాయకుడు, సామాజిక సంస్కర్త కొమరం భీమ్ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో జెర్రీమడుగు గిరిజన కాలనీలో నిర్వహించారు. కొమరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కాలనీ గిరిజనులను సన్మానించారు. బీజేపీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు చంద్రన్, నాయకులు రెడ్డి మస్తాన్, సుబ్రహ్మణ్యం, కేశవ, లక్ష్మయ్య, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం ఎస్‌ఐగా రాజశేఖర్



ఎస్‌ఐని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం ఎస్‌ఐగా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణవనం మండలం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ చిన్నరెడ్డెప్పను చిత్తూరు దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కొత్తగా వచ్చిన ఎస్‌ఐకి పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుళ్‌నాథన్ ఆధ్వర్యంలో శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేఖర్‌రాజు, సాంబశివన్, బాలాజీ నాయుడు, నవీన్‌చౌదరి, మోహన్‌రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్ సొంత నిధులతో దారి పునరుద్ధరణ



కాజ్‌వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బాహుదానదిపై అరగొండ సమీపంలో ఉన్న కాజ్‌వే కొట్టుకుపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు, రైతులు దారిలేక ఇబ్బంది పడుతున్నారు. దీన్ని గుర్తించిన అరగొండ సింగిల్ విండో చైర్మన్ రంజిత్‌రెడ్డి తన సొంత నిధులతో కాజ్‌వేకి మట్టి తోలి మరమ్మతులు చేయించి, దారిని పునరుద్ధరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, అరగొండ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇల్లు కూలిన బాధితురాలికి అండగా...



ఆండాలుకు నిత్యావసర సరుకులను ఇస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 28వ డివిజన్‌లోని వినాయకపురంలో ఆండాలు నివాసముంటున్న పూరి గుడిసె గోడ కూలిపోయింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ పూర్తిగా తడిసిపోవడంతో ఆదివారం రాత్రి పడిపోయింది. ఇంటిలోని వస్తువులు పాడైపోయాయి. దాంతో స్థానిక టీడీపీ నేతలు, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది వృద్ధురాలి నివాసాన్ని పరిశీలించారు. ఇల్లు కూలిపోవడంపై ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పడంతోపాటు ఆమెకు తక్షణసాయంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వార్డు టీడీపీ అధ్యక్షులు నిరంజన్‌బాబు, నాయకులు దయాలు, రామ, శక్తికుమార్, బూత్ కన్వీనర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణేశ్వరుడికి స్కందషష్ఠి పూజలు

వెదురుకుప్పం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామికి సోమవారం స్కందషష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ పర్యవేక్షించారు.